ఆసిఫాబాద్ : వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్ : రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రి

ఆసిఫాబాద్ : హోలీ వేడుకల్లో పోలీసు సిబ్బందితో డీఎస్పీ సదయ్య, తదితరులు

ఆసిఫాబాద్ : రంగులు చల్లుకుంటున్న మహిళలు

రంగుల హంగామా

- ఊరూరా హోలీ సంబురాలు
- రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు
- వాడవాడలా డీజే నృత్యాలతో సందడి
- వేడుకల్లో ఎమ్మెల్యే కోవలక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆసిఫాబాద్/ బెజ్జూర్/రెబ్బెన/దహెగాం/ కెరమెరి/చింతల మానేపల్లి/ జైనూర్/ కౌటాల, మార్చి 25: జిల్లావ్యాప్తంగా సోమవారం రంగుల సంబురం అంబరాన్నంటింది. యువతీయువకులు పరస్పరం రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. కేరింతలు కొడుతూ బైక్‌లపై తిరిగారు. వాడవాడలా డీజే నృత్యాలతో హోరెత్తించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మిపై బీఆర్ఎస్ కార్యకర్తలు రంగులు చల్లారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్ రావు, యువకులతో కలిసి చిందేశారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రి,అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఎస్పీ సదయ్య వేడుకల్లో పాల్గొన్నారు. బెజ్జూరు మండలవ్యాప్తంగా గిరిజనులు సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కామ దహనం నిర్వహించారు. అనవాయితీ ప్రకారం బూడిదను పరస్పరం పూసుకున్నారు. అలాగే రెబ్బెన, దహెగాం మండలాల్లోని అన్ని గ్రామాల్లో రంగుల సంబురాన్ని ఘనంగా జరుపుకున్నారు. కెరమెరి మండలంలో ఆదివాసీలు సాంప్రదాయబద్ధంగా కాముడి దహనం చేసిన ప్రాంతంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అన్ని ఆహార ధాన్యలతో వండిన గుడాలతో దేవునికి నైవేద్యం సమర్పించి, సహపంక్తి భోజనం చేశారు. అనంతరం డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ కాముడి దహనం చేసిన చోట మాతరి, మాత రలకు రంగులు చల్లుకుని ఆనందంలో మునిగితేలారు. ఇంటింటికీ వెళ్లి కానుకలు సేకరించారు. చింతలమానేపల్లితో పాటు అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జైనూర్ మండలంలో హోలీ వేడుకలు అట్టహాసంగా జరుపుకున్నారు. ఎంపీపీ తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్ను పటేల్, మాజీ ఎంపీపీ విమలా ప్రకాశ్, మాజీ జడ్పీటీసీ కొడప విశ్వంబర్‌కు పార్టీ నాయకులు రంగులు చల్లి పండుగ శుభాకాంక్షలు చెప్పారు. కౌటాల మండల వ్యాప్తంగా రంగుల సంబురాలు అంబరాన్నంటాయి. యువతీయువకులు రంగులు చల్లుకుంటూ సంద డి చేశారు. కూడళ్లలో డేజే నృత్యాలతో అలరించారు.

బెజ్జూర్ : గోల్కొండలో యువకులు..

బెజ్జూర్ : మండల కేంద్రంలో యువకులతో కలిసి హోలీ సంబురాల్లో పాల్గొన్న ఎస్ఐ విక్రమ్

చింతమానేపల్లి : బాలాజీ అనుకోడలో హోలీ వేడుకల్లో యువకులు, మహిళలు

దహెగాం : ఇట్యాలలో హోలీ వేడుకల్లో చిన్నారులు

బెజ్జూర్ : కుకుడలో హోలీ సంబురాల్లో యువతుల సంతోషం

దహెగాం : పరస్పరం రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

చింతలమానేపల్లి : కాముడిని దహనం చేస్తున్న గ్రామస్తులు

కౌటాల : కౌటాలలో హోలీ సంబురాల్లో యువకులు

రెబ్బెన : హోలీ సంబురాల్లో గ్రామస్తులు

జైనూర్ : రంగులు పూసుకుంటున్న వ్యాపారులు

గోవులను అక్రమ రవాణా చేస్తే ఊరుకోం

కాగజ్‌నగర్, మార్చి 25: గోవులను అక్రమంగా రవాణా చేస్తే సహించబోమని బజ్‌రంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివ గౌడ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్, పార్టీ నేత దెబ్బెటి శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి సిర్పూర్ (టి)లో బజ్‌రంగ్‌దళ్ ప్రతినిధులు అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న గోవుల వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించామని వెల్లడించారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, మార్చి 25: మండల కేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఏఎస్ఐ యాదవ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. చింతలమానేపల్లికి చెందిన మెస్రం రవి వద్ద 5 లీటర్ల గుడుంబా, రూ. 2 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

చింతలమానేపల్లి, మార్చి 25: మండల కేంద్రంలోని కస్తూర్బా స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం టిఫిన్‌లో పూరీలు, మధ్యాహ్నం చికెన్ తినడంతో వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు వీరికి స్థానిక వైద్యుడి వద్ద చికిత్స చేయించామని ఇన్‌చార్జి ఎస్వో శ్రీదేవి తెలిపారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉన్నదని వెల్లడించారు. కొలుకున్న ఏడో తరగతికి చెందిన ముగ్గురిని ఇండ్లకు పంపించామని పేర్కొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి

- లేదంటే తీవ్ర పరిణామాలు
- సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్, మార్చి 25: లారీ అసోసియేషన్ సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాగజ్‌నగర్ పేపర్ మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగజ్‌నగర్ పెట్రోల్ పంపు ఏరియాలోని లారీ అసోసియేషన్ భవన్‌లో యూనియన్ అధ్యక్షుడు వెన్న కిషోర్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని సోమవారం కోనప్ప సందర్శించి మద్దతు తెలిపారు. 150 మంది లారీ యాజమానులు, వీరిపై ఆధారపడ్డ 600 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపా రు. పోలీసుల అండతో మిల్లు యాజమా న్యం విర్రవీగితే చూస్తు ఊరుకోబోమన్నా రు. ఇండస్ట్రీయల్ మంత్రి శ్రీధర్‌బాబు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఒకటి, రెండు రోజు ల్లో సమస్య పరిష్కరించకుంటే తానే స్వ యంగా దీక్షకు దిగుతానని తేల్చి చెప్పారు.

చర్చలు సఫలం...దీక్ష విరమణ

కాగజ్‌నగర్, మార్చి 25: లారీ ఆసోసియేషన్, పేపర్ మిల్లు యాజమాన్యం మధ్య సోమవారం జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప లారీ అసోసియేషన్ ప్రతినిధులు, పేపర్ మిల్లు జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, సినీయర్ మేనేజర్ రమేశ్ రావు, ప్రతినిధులు బియాని, మిశ్రాతో ఎస్పీఎం క్లబ్‌లో రాత్రి చర్చలు జరిగాయి. వచ్చే నెల నుంచి అన్‌లోడింగ్, టోల్ గేట్ చార్జీలు మిల్లు భరిస్తుందని ఒప్పుకున్నట్లు లారీ అసోసియేషన్ బాధ్యులు స్పష్టం చేశారు. అలాగే లారీ కిరాయి, ఇతరాత్ర సమస్యలు వచ్చే నెల 10 తర్వాత పరిష్కారానికి అంగీకరించిందని వెల్లడించారు. చర్చలు సఫలం కావడంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిషోర్ బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

అడవిలో పర్యటించి.. అవగాహన పెంచుకొని

- బెజ్జూర్ అటవీ ప్రాంతంలో ట్రైనీ ఎఫ్‌బీవోలు

బెజ్జూర్ అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యం గురించి వివరిస్తున్న కోర్సు అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్

బెజ్జూర్, మార్చి 25: తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ధూలపల్లిలో శిక్షణ పొందుతున్న 34 బ్యాచ్ బీ సెక్షన్ బీట్ అధికారులు వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవడానికి బెజ్జూర్ అటవీ ప్రాంతంలో ఆది, సోమవారాల్లో పర్యటించారు. అకాడమీ కోర్సు అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ వీరిని కీలకమైన ప్రదేశాల్లో తీసుకెళ్లి పలు విషయాలపై అవగాహన కల్పించారు. బెజ్జూర్ అటవీప్రాంతం వన్య ప్రాణులు, పక్షిజాతులతో జీవ వైవిధ్యానికి నెలవని వివరించారు. ఇక్కడ వన్య ప్రాణులకు జలాధారమైన పెరిమియల్ వాటర్ సోర్సు మత్తడి స్ట్రీమ్, చవుడు నేలలు, మత్తడి సమీపంలో అటవీ అధికారులు పెంచుతున్న గ్రాస్‌ప్లాంటును చూపించారు. అదే విధంగా టైగర్ ట్రాకింగ్‌లో భాగంగా పులి పాదముద్రలను ఏలా కొలతలు తీసుకోవాలి? పులి మలవిసర్జనతో ఆహారంగా ఏజంతువును తిన్నది.. మలంలో కనిపించే ఎముకలు, వెంట్రుకలు తదితరవాటిని బట్టి వన్యప్రాణి ఆహారంగా తీసుకొన్నదో తెలుసుకోవచ్చని యానిమల్ ట్రాకర్స్ సిబ్బంది వివరించారు. అనంతరం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మచాన్, వన్య ప్రాణులకు నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో దయాకర్, ఎఫ్‌బీవో సంఘదీప్, యానిమల్ ట్రాకర్స్ సిబ్బంది మహేశ్, సుభాశ్, రాకేశ్, 50 మంది ట్రైనీ బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్యారం పోటీలకు సందీప్

జాతీయస్థాయి క్యారం పోటీలకు ఎంపికైన విద్యార్థి సందీప్‌తో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

ఆసిఫాబాద్,మార్చి25: జాతీయస్థాయి క్యారం పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి జాడి సందీప్ ఎంపికయ్యారు. సందీప్ ఈనెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని నాగోల్‌లో నిర్వహించే నేషనల్ లెవట్ పోటీల్లో పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. విద్యార్థిని పీడీ సట్ల శంకర్, పీఈటీ యాదగిరి, క్యారం అసోసియేషన్ అర్గనైజింగ్ సెక్రటరీ రాజన్న, హౌస్ మాస్టర్ పండిత్ అభినందించారు.

కవితల పోటీల్లో రాజేశ్వర్‌రావు ప్రతిభ

లక్షెట్టిపేట, మార్చి 25: పట్టణానికి చెందిన కవి లేదాళ్ల రాజేశ్వర్‌రావు డాక్టర్ బట్టిప్రోలు దుర్గా లక్ష్మీప్రసన్న స్మారక వచనా కవితల పోటీల్లో ప్రతిభ కనబరిచి కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న ఆయన ఇనుపపెట్టి అనే కవితను రాసి శభాష్ అనిపించుకున్నారు. ప్రముఖ కవులు డాక్టర్ శిఖా మణి, శివారెడ్డి, వాడ్రెపు చినవీరభద్రుల చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కవి రాజేశ్వర్ రావును పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

బహుమతి అందుకుంటున్న రాజేశ్వర్‌రావు

ఖైదీలు సత్ప్రవర్తనను అలవరుచుకోవాలి

- ఆసిఫాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి

ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి

ఆసిఫాబాద్,మార్చి 25: జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనను అలవరుచుకోవాలని ఆసిఫాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి సూచించారు. లిగల్ సర్వీసెస్ జిల్లా చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఖైదీలకు చట్టాలు, జీవన విధానంపై మూడురోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని మాట్లాడుతూ నేరాల్లో చిక్కుకొని జైలు జీవితం గడుపుతున్న వారు కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. బాధ్యతగా వ్యవహరిస్తూ సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. నేరప్రవృత్తిని వీడి ప్రశాంత జీవనాన్ని అలవరుచుకోవాలని కోరారు. బెయిల్‌కు అర్హత ఉన్న ఖైదీలు షూరిటీలు సమర్పిస్తే వెంటనే బెయిల్ మంజూరు చేస్తామని చెప్పారు. ఇక్కడ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

భీమన్న ఆలయంలో చోరీ

- కంచు, వెండి విగ్రహాల అపహరణ


చోరీ జరిగిన భీమన్న ఆలయం

ఆలయంలో ధ్వంసం చేసి విగ్రహాలను అపహరించిన ప్రదేశం

దహెగాం,మార్చి 25: చౌవక పంచాయతీ పరిధిలోని యేటిగూడ భీమన్న ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు కంచు, వెండి విగ్రహాలను ఎత్తుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. ఆలయ పూజారి నాయిని చిన్నన్న ఆదివారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లాడు. ఆవరణలో పసుపు, కుంకుమతో గుండం పోసి ఉండడాన్ని గమనించి గ్రామస్తులకు తెలియజేశాడు. వారితో కలిసి గుడి లోపలికి వెళ్లగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. కంచు, వెండి విగ్రహాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.